నేటి దినపత్రిక
సూర్య
ఉత్తరాంధ్ర
www.suryaa.com
బుధవారం
4-12-2024
పేజీలు 4
విశాఖ - అనకాపల్లి - అల్లూరి - మన్యం
విజయనగరం
శ్రీకాకుళం



ఆర్ అండ్ బి రోడ్లకు మహర్దశ

రూ.14 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన
శంకుస్థాపన చేసిన కలెక్టర్ విజయ్ కృష్ణన్, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తా స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం డిసెంబర్ 3 మేజర్ న్యూస్

నర్సీపట్నం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా ఆర్ అండ్ బి రహదారులు పంచాయతీ రోడ్లకు మహార్దశ పట్టింది స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి కారణంగా ఎంతవరకు ప్రజలు పాడైపోయిన రోడ్లలో నరకయాతన అనుభవించేవారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనవరి లోపు రోడ్లన్నీ పూర్తి చేయడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ ప్రశంసలు పొందుతున్నారు. నాతవరం మండలం శృంగవరం నుంచి గన్నవరం మెట్ట కాకినాడ జిల్లా సరిహద్దు వరకు రూ.14 కోట్లతో చేపట్టే 4.3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఐదు నెలల పరిపాలనలో నియోజకవర్గ అభివృద్ధికి రూ. 78.67 లక్షల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. శృంగవరం, ఎంబీపట్నం, మన్యపురట్ల, శరభవరం, గన్నవరం, ఏపీపురం గ్రామాల్లో రోడ్ల పనులకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశామని, జంక్షన్ నుంచి మన్యపురట్ల జంక్షన్ వరకు రూ.90 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వైబీఅగ్రహారం నుంచి ఉప్పరగూడెం వరకు, ఉప్పరగూడెం నుంచి కాకరాపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఐదు నెలల్లో నాతవరం మండలానికి రూ.21 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల వరకు పార్టీలకు అతీతంగా అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ నెల 8న జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో విజయమే అభివృద్ధి పనులకన్నా మిగతా 2లో

సరైన ప్రోత్సాహం ద్వారా
దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలి
జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

అనకాపల్లి ప్రతినిధి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో స్థానిక వి.వి. రమణ రైతు భారతి పార్క్ సెంటర్ నందు నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం "సమగ్ర, స్థిరమైన భవిష్యత్తు కోసం వికలాంగుల నాయకత్వాన్ని విస్తరించడం" అనే థీమ్‌తో అంతర్జాతీయ విభిన్న మిగతా 2లో

వ్యవసాయానుబంధ పనులకు
అత్యధిక ప్రాధాన్యత
12 మంది ఎంపిడిఓలకు షోకాజ్ నోటీసులు -జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

పాడేరుడిసెంబర్ 3 మేజర్ న్యూస్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయానుబంధ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుండి వ్యవసాయ, ఉద్యానవన, ఐసిడిఎస్, ఉపాధిహామీ, పశు సంవర్ధక శాఖ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలు అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 64 వేల ఉపాధి హామీ జాబ్ కార్డుదారులకు వందరోజుల పని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని

అంగన్వాడీ కేంద్రాల పనులు వేగవంతం కావాలి
కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం రూరల్, డిసెంబర్ 3, మేజర్న్యూస్

జిల్లాలో చేపడుతున్న అంగన్వాడీ కేంద్రాల్లోని పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఐసీడీ ఎస్ పీఓ, సీడీపీఓ, ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి లోపల, వెలుపల అందమైన రంగులు వేయించడంతో పాటు కేంద్రానికి బోర్డు, కేంద్రంలో అంద మైన చిత్రాలు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్, వైట్ బోర్డు, ఆట పరికరాలు, పాఠ్య పుస్తకాలు, కుర్చీలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్డి, రన్నింగ్ వాటర్ ఉండాలని అన్నారు. ఇందుకోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం వారికి నిధులు మంజూరుచేశామని, వాటిని మిగతా 2లో

గిరిజనులు ఉద్యోగవంతులు కావాలి
గిరి పుత్రుల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం -గిరి ప్రతిభ -ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభించిన మంత్రి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 2, మేజర్న్యూస్

గిరి ప్రతిభ - ఉచిత డీఎస్సీ కోచింగ్ ను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. పార్వతీపురంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను గిరిజన విద్యార్థులకు గిరిజన సామాజిక భవనంలో ప్రారంభించారు. ఉచిత కోచింగ్ రెండు నెలల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్ట మొదట సారిగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 16500 పోస్టుల తో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారని చెప్పారు. కోచింగ్ కు సుముఖంగా ఉన్న అభ్యర్థులకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. కోచింగ్ తీసుకున్న అందరూ ఉపాధ్యాయ పోస్టులు సాధిస్తారని ఆమె విశ్వాసం ప్రకటించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మిగతా 2లో

వికలాంగుల భాగస్వామ్యాన్ని.. నాయకత్వాన్ని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి
కీలక నిర్ణయాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలి -అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్టణం, డిసెంబర్ 3, మేజర్న్యూస్

ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో నడిచే అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతుల (వికలాంగులు) భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, వారిని విశ్వవిజేతలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కీలక నిర్ణయాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 03, "సమగ్ర, స్థిరమైన భవిష్యత్తు కోసం వికలాంగుల నాయకత్వాన్ని విస్తరించడం" అనే థీమ్‌తో స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మతో కలిసి జిల్లా కలెక్టర్ మిగతా 2లో

రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి
మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు

విశాఖపట్నం, డిసెంబరు 3, మేజర్న్యూస్

తుఫాను వల్ల అన్ని రకాలుగా నష్ట పోయి ఉన్న రైతుల వద్ద గల రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర పౌర సఫరాల శాఖ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు కోరారు. మంగళవారం లాసన్స్ బే కాలని బొత్స సత్యనారాయణ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తుఫాను వల్ల ధాన్యం రంగు మారడంతో రైతులు నట్టేట మునిగారని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దళారీలు రైతులను నట్టేట ముంచుతున్నారని ఆయన విమర్శించారు. ఇటువంటి విపత్కర పరిస్తితుల్లో ఉన్న రైతును ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే రైతులు క్షమించరని ఆయన హెచ్చరించారు. తమ వైసిపి ప్రభుత్వ హయాంలో తాము రైతుల వద్ద మిగతా 2లో

ప్రభుత్వ భూములకు
రెవెన్యూ అధికారులే సంరక్షకులు

రెవెన్యూ అధికారులు పనితీరు మారకపోతే కఠిన చర్యలు -అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు -ఈ నెల 5 నుండి రెవిన్యూ సదస్సులు : జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్

2 లో

ఓడిశా జయభేరి

2 లో

అస్సాంపై 63 పరుగుల విజయం -కేవలం 8.1 ఓవర్లలో 57 పరుగులకు అస్సాం ఆలౌట్

ట్రైబల్ యూనివర్సిటీ
పనులు వేగవంతం చేయాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

2 లో

'గ్రేటర్' జోన్ 2, మిథిలాపురీ వుడా కాలనీలో..
'లడ్డూ' బరి తెగింపు..!
అక్రమంగా అదనపు అంతస్తుల నిర్మాణం -అవినీతి మత్తులో సహకరించిన జోన్ -2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది -పట్టించుకోని జీవీఎంసీ ఉన్నత యంత్రాంగం

(మేజర్న్యూస్-విశాఖపట్నం)

జీవీఎంసీ జోన్ 2 పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. కొందరు అక్రమ భవన నిర్మాణదారులు బరితెగిస్తున్నారు. నిబంధనల మేర నిర్మాణాలు జరపకుండా... నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ తమకునచ్చినట్లు నిర్మాణాలు సాగిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ.. నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ యంత్రాంగం మౌన ముద్ర వహిస్తోంది. అక్రమ నిర్మాణాలను నియంత్రించకుండా... మిగతా 2లో

అంగన్వాడీ కేంద్రాల పనులు వేగవంతం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీడీఓలు పొంది పనులు వేగవంతం చేయించాలని కోరారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన విద్య, పోషకాలతో కూడిన ఆహారాన్ని పిల్లలకు అందించాలని, వాటిని సక్రమంగా అందించే బాధ్యత సీడీపీఓలదేనని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల పనులు, పోషణ్ వాటిక నిర్వహణ ప్రగతిపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మంగళ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటిక అమలుచేయాలని, ఇందుకు అవసరమైన పంటలు, మొక్కల విత్తనాలను ఉచితంగా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. అక్కడ పండించిన ఆకు,కాయగూరలను పిల్లలు తీసుకునే ఆహారంలో వినియోగించాలని సూచించారు. పిల్లలు భోజనంకు ముందు, తదుపరి చేతులు కడుగుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలని తెలిపారు. కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం మునుపటి కంటే పెరగాలని, ఆ దిశగా కేంద్రాలను ఆకర్షనీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ఎం.ఎన్.రాణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు పాల్గొన్నారు.

గిరిజనులు ఉద్యోగవంతులు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఉపాధ్యాయులు స్పెషల్ డిఎస్సీ వద్దు అనడం సమంజసం కాదని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో రూ.8000 కు ఉద్యోగం చేస్తుంటే 2016లో రూ.18 వేలకు అప్పటి ముఖ్య మంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పెంచారని తెలిపారు. గత ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క దరఖాస్తు కూడా ఇవ్వలేదని ఇప్పుడు 1650 మంది ఇప్పుడు రోడ్డు మీద పడతామని అంటున్నారని చెప్పారు. వారికి ఉద్యోగాల నుండి తొలగించడం లేదని స్పష్టం చేశారు. అర్హతలు, ప్రతిభ ఉన్న ఉపాధ్యాయులు రావాలని, గిరిజన విద్యార్థులకు మంచి ప్రామాణిక విద్య అందాలని అన్నారు. గిరిజన పిల్లలను బాగా చదివించాలని ఆమె చెప్పారు. డీఎస్సీలో 2 వేల పోస్టులు గిరిజనులకు కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో 2 వేల రహదారులను రూ.2500 కోట్లతో వేయడం జరుగుతోందని, దోకి మోతలు ఉండకూడదని కృత నిశ్చ యంతో ఉన్నామని వివరించారు. గుంతలు లేని రహదారులను చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 4 బెడ్స్ తో కంటైనర్ ఆసుపత్రులు ఏర్పాటు చేశామని, త్వరలో కురుపాం, పాలకొండ నియోజక వర్గాలలో ప్రారంభిస్తామని తెలిపారు. గిరిజను లకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. కురుపాం శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలని ఆకాక్షించారు.పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కోచింగ్ ను సద్వినియోగం చేసుకోవాల, ప్రాంతం పరంగా మన్యం జిల్లా వెనుకబడి ఉన్న ఉద్యోగ అవకాశాలు సాధించి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. ఎమ్మెల్యే విజయ చంద్ర మాట్లాడుతూ ప్రతిభ ఎవరి సొత్తు కాదని ఎంతో శ్రమిస్తే గాని ఫలితాలు సాధించలేమన్నారు.ప్రతీ ఒక్కరిలో ప్రతిభ ఉందని దానిని చక్కగా వినియోగించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ఆంధ్రా దిశగా అడుగులు వేస్తూ 20 లక్షలు ఉద్యోగాలు ఇవ్వాలని సంకల్పం అన్నారు. విశాఖకు టి.సి.ఎస్ వస్తుందని, 10 వేల ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని కోరారు. ముఖ్య మంత్రి ఆశయం ప్రతి ఒక్కరి భవిష్యత్తు తీర్చిదిద్దాలని అన్నారు. అద్భుత ప్రపంచం మీ కోసం వేచి చూస్తోందని అవకాశాలు అందుపుచ్చుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ కష్టపడితే ఫలితం దక్కుతుందన్నారు. ప్రతిభను నిరూపించాలని ప్రోత్సహించారు. ఈ ఉచిత డీఎస్సీ శిక్షణకు ఇప్పటివరకు 230 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇంకా ఎవరైనా ఉంటే ముందుకు రావాలన్నారు. శిక్షణ తీసుకుంటున్న కాలంలో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని,సీతంపేట ఐటిడిఏ ప్రాంతంలో మరో కోచింగ్ ఏర్పాటు చేస్తామని, అవసరమైతే గుమ్మలక్ష్మిపురం వంటి చోట్ల కూడా ఏర్పాటు చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో ఈ నెల 6,7 తేదీల్లో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగ అవకాశాలుపై అవగాహన కార్యక్రమాలు సీతంపేట, పార్వతీపురంలలో ఏర్పాటు చేస్తున్నామ న్నారు. గిరి ప్రతిభ ద్వారా అన్ని రకాల ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని ఆయన చెప్పారు.

వికలాంగుల భాగస్వామ్యాన్ని.. నాయకత్వాన్ని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం అయ్యారు. జ్యోతి ప్రజ్వలన ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించి అక్కడకు విచ్చేసిన అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, విభిన్న ప్రతిభావంతులను ఉద్దేశించి మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులకు నిజంగానే విభిన్న మైన శక్తులు ఉంటాయని వారు చేస్తున్న పనులు, తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలే దీనికి నిదర్శమని పేర్కొన్నారు. ఇక్కడ వేదికపై పలువురు అంగవైకల్యం కలిగిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను చూసి మంత్ర ముగ్ధుడినై పోయానని, వారి శక్తి అమోఘమని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. వారికి తగిన చేయూత, ప్రోత్సాహం అందిస్తే మరింత ప్రతిభావంతులుగా తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3,000 నుంచి రూ.6,000కు వికలాంగు పింఛను పెంచిందని, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.5,000 నుంచి రూ.15,000కు పెంచి అందిస్తోందని గుర్తు చేశారు. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని, అవసరమైన వారికి పరికరాలు అందజేస్తున్నాయని వివరించారు. జిల్లా యంత్రాంగం తరఫున ఇప్పటికే పలు శిబిరాలు పెట్టి పరికాలు అందజేశామని, భవిష్యత్తులో మరిన్ని క్యాంపులు పెట్టి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, సహాయ, సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ భరోసా ఇచ్చారు.

చట్టం కల్పించే అన్ని హక్కుల గురించీ తెలుసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి 2016/2017లో వచ్చిన చట్టంలో వికలాంగుల హక్కుల కోసం సవివరంగా చెబుతోందని, వాటి గురించి వారు తప్పనిసరిగా తెలుసుకోవాలని సినీయర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ సూచించారు. వారి హక్కులకు చట్టబద్ధత ఉందని, వాటిని వినియోగించు కోవటం ద్వారా రాజ్యాంగం, ప్రభుత్వాలు వారికి కల్పించిన ప్రయోజనాలను పొందాలని హితవు పలికారు. విద్యా, వైద్య ఇతర రంగాల్లో లభించే ప్రయోజనాల కోసం, హక్కుల కోసం వికలాంగులతో పాటు వారి సంరక్షకులు, తల్లిదండ్రులు కూడా తెలుసుకోవాలని, అవసరమైన సమయాల్లో వాటి కోసం పోరాడాలని సూచించారు. వీటిపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విరివిగా అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఇప్పటికే జిల్లాలోని చాలా విద్యా, వైద్య సంస్థల్లో శిబిరాలు పెట్టి హక్కులపై అవగాహన కల్పించామని చెప్పారు. ప్రభుత్వ శాఖల తరఫున కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీఎస్సార్ నిధుల సహాయంతో వారు ఉండే చోట మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామని కార్యదర్శి ఈ సందర్భంగా చెప్పారు. మనతో పాటు వారిని సమానంగా చూడాలని, అన్నింటిలో ప్రాధాన్యత కల్పించాలని పిలుపునిచ్చారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన శాలలను జిల్లా కలెక్టర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సందర్శించారు. అనంతరం వివిధ పోటీల్లో నిలిచిన 532 మంది విజేతలకు బహుమతులు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. వివిధ సంస్థల్లో వికలాంగులకు సేవలందిస్తున్న వాలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. ఆహుతులను అలరించే విధంగా సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులతో కలెక్టర్, కార్యదర్శి బృందా ఫోటోలో దిగి వారిని అభినందించారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఈవో ప్రేమ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సూపరింటెండెంట్ పద్మావతి, సమగ్ర శిక్షా అధికారులు, వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రంగు మారిన ధాన్యాన్ని చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేసి డబ్బును వెంటనే వారి బ్యాంకు అకౌంట్ లో వేసా మన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014 - 2019 మధ్య కాలంలో 17 లక్షల 94 వేల మంది రైతుల నుంచి 2 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 40 వేల 236 కోట్ల రూపాయలు వారి బ్యాంకు అకౌంట్లలో వేసారన్నారు. తాము అధికారంలో ఉన్న 2019 -2024 మధ్య కాలంలో 37 లక్షల 70 వేల మంది రైతుల నుంచి 3కోట్ల 27 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేసి 65 వేల కోట్ల రూపాయలను వారి ఆకౌంట్లలో వేసామన్నారు. దీన్ని బట్టి రైతులకు ఎవరు ఎక్కువ మేలు చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్ పాలిట్రిక్స్ ను ప్రక్కన పెట్టి తుఫానుతో సర్వం కోల్పోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో ఆయనతో పాటుగా వైసిపి సీనియర్ లీడర్ రవిరెడ్డి ఫాల్గొన్నారు.

ట్రైబల్ యూనివర్సిటీ

విజయనగరం బ్యూరో, డిసెంబరు 3, మేజర్‌న్యూస్

గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. యూనివర్సిటీ పనులపై తమ ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. విద్యుత్ సమస్యలపై చర్చించారు. నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.శ్రీనివాసన్, ఏఓ డాక్టర్ ఎన్‌వి సూర్యనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జెన్కో ఎస్ఈ కె.నర్సింహరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి రోడ్లకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

ముందుందని తెలిపారు. నీటి సంఘాల ఎన్నికల్లో గెలిస్తేనే అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. తాండవ ఎత్తిపోతల కోసం రూ. 2,400 కోట్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ నిధులతో సంఘం ఆధ్వర్యంలోనే పనులు జరుగుతాయని తెలిపారు. రాజకీయాలకి దూరంగా ఉండి గ్రామాభివృద్ధి కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. పాల్గొన్నవారిలో ఆర్డీవో రమణ, టీడీపీ నాయకులు నానిబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజనా వీరసూర్యచంద్ర, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. గాంధీనగరం వద్ద ఉన్న ప్రభుత్వం స్థలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు ఉపయోగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్పీకర్ కోరారు.

సరైన ప్రోత్సాహం ద్వారా ..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిభావంతుల దినోత్సవం జరుపుకుంటున్నామని, అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతులను (వికలాంగులు) ప్రోత్సహిం చడం ద్వారా వారిని విజేతలుగా నిలబెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి అన్నారు. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం నుంచి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతుల (వికలాంగులు) అభ్యున్నతికి ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3,000 నుంచి రూ.6,000కు వికలాంగు పింఛను పెంచిందని, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.5,000 నుంచి రూ.15,000కు పెంచి అందిస్తోం దని గుర్తు చేశారు. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయని, అవసరమైన వారికి పరికరాలు అందజేస్తున్నాయని వివరించారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ నుండి బధిర దివ్యాంగులకు ఐదు టచ్ ఫోన్‌లను, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధృవీ కరణ పత్రాలు అందజేశారు. వివిధ సంస్థల్లో వికలాంగులకు సేవలందిస్తున్న వాలంటీర్లను దుశ్శాలువాలతో సత్కరించారు. చివరగా దివ్యాంగ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్, పిడి మెప్మా, డిఎస్డిఓ, వివిధ దివ్యాంగ సంఘాల అధ్యక్షులు, వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు..

పాడేరు,డిసెంబరు 3, మేజర్‌న్యూస్

ప్రభుత్వ భూములకు రెవెన్యూ అధికారులు సంరక్షకులని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఒక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరమైన పౌర సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ అధికారులు పనితీరు మెరుగుపడాలని అన్నారు. పౌర సేవలు అందించడంలో జాప్యం జరగకూడదని అన్నారు. ప్రజలకు కావలసిన కుల ధ్రువీకరణ పత్రాలు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు వేగంగా జారీ చేయాలని పేర్కొన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ పక్కగా జరగాలని సూచించారు. మ్యుటేషన్లలో అక్రమాలకు అవినీతికి పాల్పడితే ఉద్యోగాలు తొలగిస్తామని హెచ్చరించారు. ఈనెల 5వ తేదీ నుండి జనవరి 8 వరకు జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని చెప్పారు. రెవిన్యూ సదస్సులో సమస్యలను గుర్తించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవిన్యూ సదస్సులో 60 శాతం సమస్యలు పంచాయతీ పరిష్కారం జరగాలని అన్నారు. రెవిన్యూ సదస్సులపై ముందుగా షెడ్యూల్ ప్రకటించి ప్రజలను చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. 15 రోజుల్లో భూ అక్రములపై సర్వే పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరిగితే సంబంధిత భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ భూములపై ఆడిట్ చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ అధికారులు, ఈవో పి ఆర్ డి లు ప్రభుత్వ భూములను ఆడిట్ చేయాలని స్పష్టం చేశారు. ఆక్రమణలపై తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలని చెప్పారు. మండల స్థాయి సమస్యలు కలెక్టర్ వరకు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. డిసెంబర్ నెలలోగా ఈ ఆఫీస్ ప్రక్రియకు అవసరమైన పనులు పూర్తిచేసి వచ్చే జనవరి ఒకటో తేదీ నుండి తాహసిల్దార్ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ ప్రక్రియ జరగాలన్నారు. తాహసిల్దార్ కార్యాలయం నుండి ఫైల్స్ అన్ని ఈ ఆఫీస్ నుండి పంపించాలని సూచించారు. రీసెర్వేపై గ్రామాలలో గ్రామసభలు నిచెప్పారు చెప్పారు. రీసర్వే ప్రక్రియ ప్రారంభించాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ మాట్లాడుతూ మీకోసం (పి. జి. ఆర్.ఎస్) సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి తాహసిల్దారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. సేవాపరమైన సమస్యలకు విఆర్వోలు బాధ్యత వహించాలాన్నారు. జిల్లాలో భూ సమస్యలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. భూ వివాదాలు భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. వీఆర్వోలు, తాహసిల్దార్ కార్యాలయాల్లోనూ రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీలకు వచ్చినపుడు రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . మండల స్థాయిలో స్వీకరిస్తున్న ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ పద్మలత, పాడేరు డివిజన్లోని తాసిల్దార్లు, పీఎంయు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, డిప్యూటీ తాసిల్దారులు, ఆర్. ఐ లు, సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానుబంధ పనులకు..

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసారు. ప్రతీ మండలంలోను 100 ఫారం పాండ్స్ నిర్మాణాలు ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫారంపాండ్స్ వెడల్పు, లోతులను, ఎంత నీరు పడుతుందని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఉపాధి హామీ పనులపై ఎంపిడి ఓలు దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యాలు సాధించలేని ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బరువు తక్కువ, పోషకాహారం లోపంతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాలను సమర్దవంతంగా అమలు చేయాలన్నారు. బాలికా వివాహాల నిర్మూలనకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. రైతులకు పి. ఎం. కిసాన్ పథకం అందించడానికి ఇ.కె. వైసీ, ఆధార్ అను సంధానం ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. 982 మందికి ఆధార్ లింకింగ్ చేయాల్సి ఉందని ఆధార్ లింకింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. రైతులకు పంటల బీమా పథకాలను అమలు చేయాలని చెప్పారు. ప్రణాళికా బద్దంగా ఉద్యాన వన పథకాలను అమలు చేయాలన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని రైతులకు రాయితీ పై ఉద్యానవన ఉపకరణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. పశుసంపదను జియోట్యాగింగ్ చేయాలని చెప్పారు. సబ్ కలెక్టర్తో చర్చించి ఎటపాక, దేవీ పట్నం మండాల మత్స్యకారులకు లైసెన్సులు జారీ చేయాలని చెప్పారు. మత్స్యకారులకు చేపల వేటపై తగిన శిక్షణ అందించాలని అన్నారు.

12 మంది ఎంపిడి ఓలకు షోకాజ్ నోటీసులు

27567 మంది లబ్దిదారులను నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ లో నమోదు చేయలేదని 12 మంది ఎంపిడి ఓలకు సోకాజ్ నోటీసులు జారీ చేయాలని 2. ?. ఓను ఆదేశించారు. చింతపల్లి, పెదబయలు, వై.రామవరం, కూనవరం, అనంతగిరి, మారేడిమిల్లి, డుంబ్రిగుడ, రంపచోడవరం, ఎటపాక, వి. ఆర్.పురం, ముంచంగిపుట్టు, జి.మాడుగుల ఎంపిడి ఓలకు షోకాజ్ నోటీసులు చేస్తామన్నారు. వెబ్ సైట్లో లబ్దిదారుల వివరాలను నమోదు చేయకపోవడం, బ్యాంకు ఖాతాల ప్రారంభించక పోవడం వలన నగదు బదిలీ పథకాలను లబ్దిదారులు నష్టపోతారని ఎంపిడి ఓలపై ఆగ్రహం వ్యక్తం చేసారు. పంచాయతీ కార్యదర్శులు విధిగా ఫేషియల్ అటెండెన్సు వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పర్చువల్గా గా పాడేరు ఐటిడిఏ పి. ఓ వి. అభిషేక్, ప్రత్యక్షంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్ .నంద్. ఐటిడి ఏస్ పి.డి. ఎన్. సూర్య లక్ష్మి, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ. రమేష్ కుమార్ రావు, పశు సంవర్ధక శాఖ డి. డి. నరసింహులు జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, సెరీ కల్చర్ ఎడి అప్పారావు, 22 మండలాల ఎంపిడి ఓలు, సిడిపి ఓలు, ఉపాధి హామీ ఎపి ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఓడిశా జయభేరి

విశాఖపట్టణం, డిసెంబరు 3, మేజర్‌న్యూస్

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20లో ఒడిశా జట్టు 63 పరుగుల తేడాతో అస్సాంపై జయభేరి మోగించింది. పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం అస్సాం-ఒడిశా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓడిశా బౌలర్లు సమష్టిగా రాణించడంలో కీలకపాత్ర పోషించారు. టాస్ నెగ్గిన అస్సాం జట్టు తొలుత ఒడిశా జట్టుకు బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అస్సాం బౌలర్లు అద్భుతమైన బౌలింగ్‌తో ఓడిశా జట్టును కట్టడి చేశారు. ఓడిశా జట్టులో స్వాస్తిక్ సమాల్, సందీప్ పట్నాయక్ మినహా మిగితా వారు రెండంకెట స్కోర్ చేయకపోవడం గమనార్హం. ప్లయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా స్వాస్తిక్ సమాల్ నిలిచాడు.

సమాల్ 'కమాల్'(మ్యాజిక్) ఇన్నింగ్..

ఓపెనర్ స్వాస్తిక్ సమాల్ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. ఓ వైపు బ్యాట్స్‌మెన్‌లు పెవిలియన్ వెళ్తున్నా సమాల్ కమాల్ ఇన్నింగ్ ఆడాడు. కేవలం 26 బంతుల్లో 5 భారీ సిక్సర్లు, 7 బౌండరీలతో 69 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. మరో బ్యాట్స్‌మెన్ 8 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్ల సహాయంతో 31 పరుగులు చేశాడు. దీంతో ఒడిశా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 117 పరుగులు చేసింది. అస్సాం బౌలర్లలో రోషన్, అనిల్ చెరో రెండు వికెట్లు, ముక్తార్ హుస్సేన్ ఒక వికెట్ తీసుకున్నాడు.

57 పరుగులకే కుప్పకూలిన అస్సాం..

ఓడిషా బౌలర్ల ధాటికి అస్సాం జట్టు కేవలం 8.1 ఓవర్లలో 57 పరుగులకు కుప్పకూలింది. స్వల్ప విజయలక్ష్యాన్ని చేధించడంలో బోల్తాపడింది. ఓడిశా బౌలర్లు రాజేష్ మహంతి, ప్రదీప్ ప్రధాన్, జమాలమొహపాత్ర, గోవింద్ పొద్దార్‌లు నిప్పులు చెరిగే బౌలింగ్‌తో అస్సాం బ్యాట్స్‌మెన్‌లను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ నలుగూరు చెరో రెండు వికెట్లు తీసి అస్సాం పతనాన్ని శాసించారు. అస్సాం జట్టులో సాహిల్ జైన్ 18 (2 ఫోర్లు, ఒక సిక్సర్), నిపాన్ దేకా12 పరుగులు చేశారు. ఇక మిగితా బ్యాట్స్‌మెన్లు రెండంకెల స్కోర్ కూడా చేయలేదు.

ఐదేళ్లలో నర్సీపట్నంనియోజకవర్గం అభివృద్ధే ముఖ్యం

రాజకీయాలు అనేవి ఎన్నికల వరకు మాత్రమే -అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, డిసెంబరు 2, మేజర్‌న్యూస్

తనకు రాజకీయాలు కన్నా గ్రామాల అభివృద్ధే ముఖ్యం అని రరాష్ట్రశాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. మంగళవారం గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం గ్రామం నుండి పీఎన్ డి పాలెం వరకు నాలుగు కోట్ల 60 లక్షల రూపాయలతో నిర్మించే బీటీ రహదారికి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వచ్చే ఐదు ఏళ్లలో నియోజకవర్గాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృత నిత్యంతో ఉన్నానని అన్నారు. మొదటి సంవత్సరం గ్రామాల్లో సిసి రోడ్లు రెండవ ఏడాది రైతులకు ఉపయోగపడే విధంగా చెరువులు అభివృద్ధి, మూడో సంవత్సరం విద్యార్థ

ఆత్మ విశ్వాసమే ఆయుధం

– ఆమదాలవలస మండల వనరుల కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం

ఆమదాలవలస రూరల్, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

వైకల్యం శరీరానికి మాత్రమే సంబంధించినదని, ఆత్మవిశ్వాసానికి మించిన ఆయుధం మరొకటి లేదని ఎంఈఓ -2 టింగ రాజు అన్నారు. ఆమదాలవలస మండల వనరుల కేంద్రంలో లూయీ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజికంగా వారికి చేయూతను అందిస్తుందని తెలియజేశారు. ఈ అవకాశాలను తల్లిదండ్రులు గుర్తించి ఇటువంటి పిల్లలకు సేవలు అందేలా చూడాలని అన్నారు. విభిన్న ప్రతిభావంతులకు కావలసింది సానుభూతి కాదని, వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తే ఉన్నతంగా ఎదుగుతారని తెలియజేశారు. ప్రస్తుత సమాజంలో ప్రతిభావంతులు రాణిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీవీ రమణమ్మ, సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, ముత్యాలరావు, మల్లేశ్వరి, సి ఆర్ పి లు శ్రీనివాసరావు, నర్సింగరావు, చంద్రకళ, శైలజ, ధనలక్ష్మి, జ్యోతి, ప్రశాంత్, రమణ, అప్పారావు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అయ్యప్ప సన్నిదానంలో లలితా సహస్రనామాలు

– ఎన్నో జన్మల పుణ్య ఫలమే "ఆధ్యాత్మిక సేవలు"

– రైతుబజార్ సత్యసాయి భజనామండలి సభ్యులు

శ్రీకాకుళం, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

ఎన్నో జన్మల పుణ్య ఫలితం ఈ ఆధ్యాత్మిక సేవలని, దేవుని సేవలో ప్రతీ ఒక్కరూ ఉండాలని, సేవయే శాంతి, సన్మార్గంలో నడిపిస్తుందని రైతుబజార్ సత్యసాయి భజనామండలి సభ్యులు మంగళవారం అన్నారు. స్థానిక కోరాడ వారివీధిలో గల రవిస్వామి అయ్యప్ప సన్నిధానంలో రైతుబజార్ సత్యసాయి బజానామండలి భక్త బృందం విజయమ్మ ఆధ్వర్యంలో సత్యసాయి భజనలు, లలితా సహస్రనామాలతోపాటు, కుంకుమార్చన చేశారు. అనంతరం భజన బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ జీవితంలో కొంత సమయాన్ని సామాజిక సేవలకు, ఆధ్యాత్మికానికి కేటాయించాలని, ఈ రోజు మేము సత్య సాయి భజనలు, లలితా సహస్రనాల పూజలు, చేస్తూ, చేయిస్తున్నామంటే అంతకంటే అదృష్టం ఇంకేమి ఉంటుందని, జీవితానికి ఇది చాలని, స్వామి వారి సేవలో నిరంతరం ఉంటామన్నారు. అలాగే అయ్యప్ప సన్నిధానంలో మాకు అవకాశమిచ్చిన రవితేజ స్వామికి, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, అదే నిజమైన సంపదని, రవి స్వామి పద్దెనిమిదవ మెట్టు సందర్భంగా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యమంలో రైతు బజార్ సాయి బాబా భజన భక్త బృందం, కోరాడ వీధి స్థానికులు, రవి స్వామి కుటుంబ సభ్యులకు పాల్గొన్నారు.

కళింగుల అభివృద్ధికి కృషి చేయాలి

-కళింగ కార్పోరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

కళింగుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలనిఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. విజయవాడలో గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో కళింగ, సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు కు, కళింగ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పుష్పగుచ్చాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ చైర్మన్‌గా మంచి సంక్షేమాన్ని అందజేయాలని సూచించారు. ఎంతో ఉన్నతమైన స్థానాన్ని బాధ్యతగా గుర్తించి ప్రజలకి మరిన్ని సేవలు అందజేసేందుకు కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పట్ల శ్రద్ధ అవసరం

– ఎల్ ఎన్ పేట భవితా కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం

సరుబుజ్జిలి, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

విభిన్న ప్రతిభావంతుల పట్ల తగిన శ్రద్ధ చూపిస్తే గొప్పవాళ్లుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఎం ఈ ఓ చంద్రమౌళి అన్నారు. ఎల్ ఎన్ పేట భవితా కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రపంచ స్థాయి మేధావులు విభిన్న ప్రతిభావంతులుగా జన్మించి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. సమాజంలో విభిన్న ప్రతిభావంతులకు తగిన ప్రోత్సాహకాన్ని ప్రతి ఒక్కరు అందజేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగ పిల్లలు అంటే దేవునితో సమానులని వారికి చేసే సేవ చాలా గొప్పదని వివరించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాన్ని అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గ్రేస్ శాంతి మాట్లాడుతూ పిల్లలు ఫిజియోథెరపి సేవలు వినియోగించుకోవాలని, వైకల్యం అనేది శరీరానికి మాత్రమె మనసుకు కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్ ,శ్రావణి సంధ్య, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు రాదిక, సిఆర్పి అచ్యుతరావు, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ ఉపేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ రమాదేవి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం.. బాలిక బంగారు భవిష్యత్తుకు పునాది

– శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, డిసెంబర్ 2, మేజర్‌న్యూస్

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మంగళవారం గుజరాత్ పేటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా ఈ కార్యక్రమం ద్వారా చేయూతనివ్వనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందని, 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పి డి శాంతి, పిఓ శోభారాణి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నరసన్నపేట, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

నరసన్నపేట మండలం గొట్టిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బొగ్గు లారీ బోల్తా పడింది. ఒరిస్సా నుండి అనకాపల్లి బొగ్గులోడుతో వెళ్తున్న లారీ గొట్టిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ముందు టైరు పంచర్ కావడంతో అకస్మాత్తుగా అదుపుతప్పి బ్రిడ్జి మీద నుండి సర్వీస్ రోడ్డు పైకిలారీ బోల్తా కొట్టింది. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట పోలీసులు ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలాన్ని చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. డ్రైవర్‌కు తలపై బలమైన గాయాలు కావడంతో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తము తరలించారు. ప్రథమ చికిత్స చేసినా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్గా

బాధ్యతలు స్వీకరించిన రోణంకి

నరసన్నపేట, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

మంగళవారం విజయవాడ, గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో ఆంధ్రప్రదేశ్ కళింగ,సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా పదవిబాధ్యతలు చేపట్టిన రోణంకి కృష్ణంనాయుడుకు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన నరసన్నపేట శాసన సభ్యులు బగ్గ రమణమూర్తి ఆమదాలవలస శాసన సభ్యులు కూన రవికుమార్ ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే లాభాలు

ఆమదాలవలస, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

చేపలు, రొయ్యలు పెంపకంలో శాస్త్రీయ విధానములో పెంపకాలు చేస్తే తగిన లాభాలు పొందవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలస పట్టణంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో చేపలు, రొయ్యలలో వచ్చే వ్యాధులు నిర్ధారణపై శిక్షణా కార్యక్రమాన్ని జాతీయ మధ్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ విస్తరణ అధికారులకు చేపలు, రొయ్యలలో వచ్చే వ్యాధుల నిర్ధారణ నివారణ చర్యలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరులను సమగ్రంగా ఉపయోగించుకుని, నూతన పద్ధతులను అవలంబించాలని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపలలో వచ్చే వ్యాధులను గుర్తించడం చాలా కీలకమని, వ్యాధి నిర్ధారణ పద్ధతులను విస్తరణ అధికారులకు వివరించారు. క్షేత్రస్థాయిలో వ్యాధి నిర్ధారణ యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉన్నప్పుడు రైతులకు నాణ్యమైన సేవలు అందించవచ్చు అని తెలిపారు. మత్స్య శాఖ సహాయ సంచాలకులు వై. సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం సాగులో ఉన్న వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మత్స్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న ప్రయోగశాలలో నీటి నమూనాలను పరిశీలించడం, వ్యాధి నిర్ధారణ జరుగుతున్నదని ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు జిఎస్ రాయి, సునీత, హరికుమార్, కిరణ్, అనూషా పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలలో మోడల్ స్కూల్

విద్యార్థికి రాష్ట్రస్థాయి బ్రాంజ్ మెడల్..

నరసన్నపేట, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

పోలాకి మండలం ఈదులవలస ఏపీ మోడల్ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థి కె. చందు ఫెన్సింగ్ పోటీలలో రాష్ట్రస్థాయి బ్రాంజ్ మెడల్ సాధించింది. నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ స్టేట్మెంట్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని తన సత్తా చాటింది. ఈ సందర్భంగా మోడల్ మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ పైడి ప్రవీణ రాష్ట్రస్థాయిలో మోడల్ పాఠశాల గుర్తింపు తీసుకొచ్చిన కె చందును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్, కళాశాల. ఈదులవలస ఫిజికల్ డైరెక్టర్ ఎం. నీలము ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొని ఫెన్సింగ్ విజేతను అభినందించారు.

కళింగుల కార్పొరేషన్ అభివృద్ధికి కృషి

-పదవీ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్

ఆమదాలవలస రూరల్, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

కళింగుల కార్పొరేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. విజయవాడలోని బీసీ సంక్షేమ భవనంలో రాష్ట్ర డైరెక్టర్ పదవీ బాధ్యతలను మంగళవారం చేపట్టి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వం ఈ డైరెక్టర్ బాధ్యతను అప్పగించిందని, ఈ బాధ్యతను కార్పొరేషన్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి న్యాయం జరుగుతుందన్నారు. బాధ్యతతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని, ఈ రాష్ట్ర డైరెక్టర్ పదవే నిదర్శనం అన్నారు. ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని చంద్రశేఖర్ ను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

నాణ్యతలేని ఎరువులు విక్రయించొద్దు

– ఫెర్టిలైజర్స్ దుకాణాలలో తనిఖీలు

నరసన్నపేట, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

నరసన్నపేట పట్టణంలోని వ్యవసాయ మందుల దుకాణాలలో టెక్కలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.వి తిరుమలరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫెర్టిలైజర్స్ దుకాణంలోని మందులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, స్టాక్ బుక్ లలో ఖచ్చితమైన సమాచారాన్ని డీలర్లునమోదు చేయాలని,రైతులు కొనుగోలు చేసినఎరువులు పురుగుమందులకుతప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని,వ్యవసాయ అధికారులుసూచించిన మందులనే రైతులకు అమ్మకాలు జరపాలని, అనేక రకాల మందులను, నాణ్యతలేని మందులనురైతులకుదుకాణదారులు అమ్మకం చేయకూడదని, విక్రయించే ఎరువులకు, పురుగుమందులకు నాణ్యత సూచించేకంపెనీ స్టాండర్డ్స్ తప్పనిసరిగాఉండాలనిరైతులపై అధిక భారాన్ని మోపేందుకువిక్రయాలు నిర్వహించకూడదని, దుకాణదారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయ అధికారిని కె.సునీత పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధం

– శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

– ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

శ్రీకాకుళం, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

వైకల్యం శరీరానికి మాత్రమేనని.. ఆత్మవిశ్వాసానికి మించిన ఆయుధం లేదని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ శ్రీకాకుళం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభవంతులకు పోటీలు నిర్వహించి బహుమతులు, మొమెంటో లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కావలసింది సానుభూతి కాదని వారికి అవకాశాలు కల్పిస్తే ఉన్నతంగా ఎదుగుతారని చెప్పారు. తాము ఎందులోనూ తీసుకొని విధంగా విభిన్న ప్రతిభావంతులు రాణిస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందుకొని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు శ్రమ అనుకోకుండా విభిన్న ప్రతిభావంతుల పట్ల వాత్సల్యం శ్రద్ధ చూపిస్తే వాళ్లు గొప్ప వాళ్లుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎందరో ప్రపంచ స్థాయి మేధావులు కూడా విభిన్న ప్రతిభవంతులుగా జన్మించిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభవంతులకు రు. 3000 ఉన్న పింఛను రూ. 6000కు పెంచారని వివరించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సి ఎస్ ఆర్ ఆక్టివిటీ కింద నిధులను తెచ్చి విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ ట్రై సైకిల్లు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా, వృద్ధుల సంక్షేమ శాఖ పిడి కవిత, టిడిపి నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులు వంద శాతం పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

పల్లె పండుగలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తవ్వాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, డ్వామా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. పలు మండలాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులలో పురోగతి పెంచాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కేటాయింపులు రద్దు చేసి, అవసరమైన చోట ఆ నిధుల్ని సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రగతిలో వెనకంజలో ఉన్న పొందూరు, ఎల్ ఎన్ పేట మండల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పనులు మొదలు పెట్టడంలో భూసేకరణ, ఇతర అడ్డంకులు తదితర అంశాలపై చర్చించారు. ఈనెల 7వ తేదీ లోపు పనులన్నీ మొదలు పెట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ శనివారం నాటికి రూ.40 కోట్లు బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రస్తుతం రూ.22 కోట్లకు మాత్రమే బిల్లులు వచ్చాయని అన్నారు. రానున్న మంగళవారం నాటికి రూ.50 కోట్లు బిల్లులు చెల్లింపు జరిగేలా అధికారులు పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్వామా పీడీ బి.సుధాకర్ బాబు,జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా,పంచాయతీ రాజ్ ఎస్ఈ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోటర్ యాక్సిడెంట్ కేసులకు సంబంధించిన న్యాయవాదులు వినియోగించుకోవాలి

– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి, ఆర్ సన్యాసినాయుడు

శ్రీకాకుళం, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారు ముందస్తు లోక్ ఆదాలత్ ను నిర్వహించారు. దీనిలో భాగంగా వారు 12 కేసులు పిలువుగా దీనిలో 03 కేసులు రాజి అయ్యాయి. అలాగే న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, బజాజ్ అలియాంజ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారు 04-12-2024 అనగా బుధవారం ముందస్తు లోక్ అదాలతో పాల్గొనడం జరుగుతుంది కనుక న్యాయవాదులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలు మాదకద్రవ్యాలపై అవగాహన

సంతబొమ్మాళి, డిసెంబర్ 3, మేజర్‌న్యూస్

సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు. మంగళవారం నౌపడ గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గా గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని అంతేకాక సైబర్ మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఎక్కువ శాతం మొబైల్ ఫోన్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు . ముఖ్యంగా ఏపీకే ఫైల్ లకు దూరంగా ఉండాలని వివరించారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం వైపు వెళ్తే జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అర్హత లేకుండా యువత ద్విచక్ర వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

ఎం ఎస్ ఎం ఇ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

గత నెల 29వ తేదీ నుండి నిర్వహిస్తున్నటువంటి ఎం ఎస్ ఎం ఈ సర్వే ను మంగళవారం ఎంపీడీవో ఎస్ రామకృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎం.ఎస్. ఎం. ఈ అంటే మధ్యతర ,చిన్న తరహా, సూక్ష్మ పరిశ్రమల సర్వే. ఈ సర్వే యొక్క లక్ష్యాలు రాష్ట్రంలో అన్నీ డేటా బేస్ అభివృద్ధి చేయటం వివిధ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం మహిళలు ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాల అభివృద్ధి ఇతర సేవలను నేర్పించడం,ఆర్ఏఎంపి(ర్యాంప్) ప్రోగ్రాం ద్వారా రాష్ట్రంలోని ఎం ఎస్ ఎం ఈ లకు అవగాహన కల్పించి వాటి సామర్థ్యాన్ని పెంచే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం,అలాగే రాష్ట్రంలో బిజినెస్ డెవలప్మెంట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ను తయారు చేయడం, దీని యొక్క ప్రాథమిక లక్ష్యం అని ఈ లక్ష్యాలను నెరవేర్చడానికి క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో పాటుగా అందరు సహాయకులు ఈ సర్వేలను నిర్వహించడం జరుగుతుంది కావునా వర్తక వ్యాపార స్తులందరూ సహకరించాలని ఆయన పత్రికా ముఖంగా తెలియపరిచారు ఈరోజు భీమవరం ముగడ, బాడంగి గ్రామాల్లో లో ఆయన పరిశీలించినట్లు ఇప్పటివరకు ఈ సర్వేలో దాదాపుగా చిన్న చిన్న షాప్స్ అన్ని కూడా సర్వే డేటాను ఎంట్రీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వారితో పాటు ఈఓపి అండ్ ఆర్ డి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ

బొబ్బిలిరూరల్, డిసెంబర్ 3, మేజర్న్యూస్

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భముగా 3 వ తేదిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఛైర్మన్ గారైన శ్రీ గోనుగుంట్ల కోటేశ్వరరావు సూచనలతో స్థానిక బొబ్బిలి ఎమ్మెల్యే శ్రీ బేబీనాయన ఆదేశాలమేరకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ మేరకు మంగళవారం బొబ్బిలి సిహెచ్ సి సెంటర్ నందు ముఖ్య అతిదిగా హాజరైన తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీ రాంబర్కి శరత్ మరియు డాక్టర్ శ్రీ రాజా రమేష్ తెలుగుదేశం పార్టీ దివ్యాంగుల కార్యదర్శి శ్రీ చీమల రాంబాబు మరియు కొందరు దివ్యాంగుల సమక్షములో రోగులకు పండ్ల పంపిణీ చేయడము జరిగినది. యీ కార్యక్రమునకు హాజరైన టి. హరిబాబు, టి.శ్రీనివాసరావు, డి. దుర్గాప్రసాద్, బి. త్రినాధ, బి. బాలరాజు, జి.భాస్కరరావు, డి. పాపారావు, కె. జగదీశ్ పలువురు యీ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామ పరిధిలో మద్యం దుకాణం ఉంటే తమకు అభ్యంతరం లేదు

– గ్రామం మధ్యలో మద్యం దుణ్ణాణం ఉండరాదు అన్నదే తమ అభిప్రాయం– ఎక్సైజ్ శాఖ అధికారుల చర్చలో మద్యం దుకాణంపై ముత్యాలరెడ్డి వెల్లడి

పూసపాటిరేగ, డిసెంబర్ 3, మేజర్న్యూస్

ప్రభుత్వం నిర్వహించే మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదని, కుమిలి గ్రామం జనావాసాల మధ్యలో మద్యం దుకాణం ఉండరాదన్నదే తమ అభిప్రాయం అని మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు దర్లి ముత్యాల రెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారుల ముందు తమ అభిప్రాయాన్ని మంగళవారం వ్యక్తం చేశారు. కుమిలి గ్రామ మధ్యలో మద్యం దుకాణం కొత్తగా నిర్వహిస్తుండడంతో. మాజీ సర్పంచ్ దర్లి ముత్యాల రెడ్డి, పంచాయతీకి చెందిన ప్రజలు, మహిళలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎక్సైజ్ శాఖ అప్పటికి స్పందించకపో వడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టి కూడా తీసుకువెళ్లడంతో దుకాణం నిర్వహణపై సీఎం ఫేషి నుంచి కూడా ఫోన్ కాల్ మాజీ సర్పంచ్ దర్లి ముత్యాల రెడ్డి రావడం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి నుంచి కూడా ముత్యాల రెడ్డి కి ఫోన్ కాల్ ద్వారా మద్యం దుకాణం పై ఆరా తీశారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి దృష్టి కూడా తీసుకువెళ్లాలని అయినప్పటికీ దుకాణం మార్పు చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు అంటూ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఒకంత అసంతృప్తిగానే మాజీ సర్పంచ్ దర్లి ముత్యాల రెడ్డి తో ఫోన్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం పేషీ నుంచి మాజీ సర్పంచ్ ముత్యాల రెడ్డి కి ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఎక్సైజ్ శాఖ జిల్లా సహాయ సూపరిండెంట్ శ్రీరంగం దొర, సీఐ రవికుమార్ గ్రామ మధ్యలో ఉన్న మద్యం దుకాణాన్ని పరిశీలించారు. ఆ వెనువెంటనే మాజీ సర్పంచ్ దర్లి ముత్యాల రెడ్డి స్వగృహానికి ఎక్సైజ్ శాఖ సహాయ సూపరిండెంట్ శ్రీరంగం దొర, సీఐ రవికుమార్ చేరుకొని పూర్తిస్థాయిలో చర్చలు జరిపారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఉండడం వలన కలిగే అనర్థాలను ముత్యాల రెడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులకు వివరించారు. ప్రభుత్వం నిర్వహించే ఎక్సైజ్ పాలసీ కి తాము ఎంత మాత్రం వ్యతిరేకం కాదని, గ్రామ మధ్యలో కొత్తగా మద్యం దుకాణం నిర్వహించడం వల్ల స్కూల్ పిల్లలతో పాటు బజారుకు వెళ్లే మహిళకు, వ్యవసాయదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకే మరోచోట మద్యం దుకాణం మార్పు చేయాలని పంచాయతీలో ఉన్న అందరి అభిప్రాయం అని ఎక్సైజ్ అధికారుల వద్ద ముత్యాల రెడ్డి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం నిర్వహించడం వల్ల కలిగే అనర్థాలపై మహిళలే నీరసంలో తెలిపిన విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బజ్జన్ దుకాణం గ్రామం మధ్యలో కాకుండా మరోచోట పెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముత్యాల రెడ్డి ఆ శాఖ అధికారులను కోరారు.

ప్రమాదకరంగా రాజా కళాశాల రోడ్డు

– పట్టించుకోని అధికార యంత్రాంగం

బొబ్బిలి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

బొబ్బిలి పట్టణం లోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాజా కళాశాల, ఫూల్ బాగ్ రోడ్డు అత్యంత ప్రమాదకరం గా తయారైంది. ప్రయాణీకులు, వాహన చోదకులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణం చేస్తున్నారు. అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు, ఎప్పుడు ఏం జరుగుతుందోనని అందరిలో విపరీత టెన్షన్! అధికార యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని ఈ రహదారి లో ప్రయాణం చేసేవారంతా నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తాను సర్పంచ్‌గా చెప్పుకుంటున్నాను అనడంలో వాస్తవికత లేదు

– తన లెటర్ ప్యాడ్లపై ఎక్స్ సర్పంచ్ అని సంతకాల పెడితే ఎక్సు తొలగించి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు– భవిష్యత్తులో ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న దర్లి

పూసపాటిరేగ, డిసెంబర్ 3, మేజర్న్యూస్

అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేసి తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే తీవ్ర పరిణామాలు తప్పవని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, కుమిలి మాజీ సర్పంచ్ దర్లి ముత్యాల రెడ్డి తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని కుమిలి పంచాయతీ వైకాపాకు చెందిన సురేష్ రెడ్డి స్థానిక సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ ద్వారా అధికారులకు తన తెదేపా లెటర్ ప్యాడ్లపై ఉన్న పత్రాలను తప్పుడుగా చూపించి అధికారుల వద్ద తన మనోభావాలను కించపరిచే విధంగా వ్యవహరించడం భావ్యం కాదన్నారు. తన పత్రాలకు నకిలీ పత్రాలు సృష్టించి, తన పత్రాల్లో తాను సంతకాలు చేసే చోట ఎక్స్ సర్పంచ్ నన్ను పెడుతుంటానని, తన మనోభావాలను దెబ్బతీసేందుకు ఎక్స్ ను తొలగించి సర్పంచు అని ఉండే విధంగా ఆ నాయకులు తప్పుడు ఫిర్యాదులు చేశారని, అవసరమైతే దీనిపై ఉన్నతాధికారుల వద్ద తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ ముత్యాల రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

వృద్ధులకు ఆహారాన్ని పంపిణీ చేస్తున్న రౌతు

బొబ్బిలిరూరల్, డిసెంబర్ 3, మేజర్న్యూస్

బొబ్బిలి మండలం కోమటి పల్లి గ్రామంలో "అన్నపూర్ణ ఆపన్న హస్తం" ద్వారా వృద్ధులకు ఆహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహధ్యక్షులు శ్రీ రౌతు రామ్మూర్తి నాయుడు పాల్గొని వృద్ధులకు ఆహారాన్ని, దుప్పట్లను పంపిణీ చేశారు.అలాగే కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న పలగర సరస్వతికి మండుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 416 రోజులుగా వృద్ధుల ఇళ్లకు ఆహారాన్ని తీసుకొని వెళ్లి అందిస్తున్న బొంతలకోటి లక్ష్మి శంకర రావు దంపతులను అభినందించారు.ఈ కార్యక్రమ నిర్వాహణకు నిర్వాహకులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

బాడంగి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

బాడంగిలో గల దివ్యాంగుల భవిత కేంద్రంలోని మంగళవారంప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మండల విద్యాశాఖధికారి లక్ష్మణ దొర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో పాటు సమానంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం అనేక విద్యా, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని భవిత కేంద్రంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తూ వీరికోసం ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించిందని వాటిని దివ్యాంగ్యులందరూ సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు అనంతరం దివ్యాంగులు వారి తల్లిదండ్రులు అవగాహనా ర్యాలీ నిర్వహించి వివిధ క్రీడలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేసారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, పాపారావు,ఐఈఆర్పీ సత్యన్నారాయణ, సరిత, ఉపాధ్యాయులు ఉడుముల లక్ష్మి, రహీం తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలకు అనూహ్య స్పందన

- 220 బాధితులుగా హాజరు- పర్యవేక్షించిన ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

సీతంపేట, డిసెంబర్ 3, మేజర్న్యూస్

సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైటీసీలో మంగళవారం నిర్వహించిన సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలకు అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పరిధిలోని 20 మండలాల్లో ఇటీవల నిర్వహించిన సికిల్ సెల్ ఎనీమియా పరీక్షల్లో పాజిటివ్ వచ్చినవారికి హెచ్ పి ఎల్ సి టెస్టులను విశాఖపట్నం కె జి హెచ్ ఆసుపత్రి వైద్య బృందం వారితో నిర్వహించారు.ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి కె జి హెచ్ విశాఖపట్నం వారు పాజిటివ్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారని తెలిపారు. ఆ సర్టిఫికేట్ తో ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు ఫించన్ కు అర్హత పొందుతారని పీవో తెలిపారు.ఈ పరీక్షలకు సుమారు 220 మంది రోగులు హాజరయ్యారు. ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ డిఈవో నారాయుడు, వెలుగు డిపిఎం రమణ, ఏటీడబ్ల్యువో మంగవేణి, వైటిసి ఇంచార్జి వెంకట రమణ,సీఎంవో చిరంజీవులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంపునకు నిరసనగా సిపిఎం నాయకులు ధర్నా

బొబ్బిలి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

విద్యుత్ చార్జీలు పెంపుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సింగారపువీధిలో ప్రచారం చేసి నిరసన తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణ యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయా లని కోరుతూ విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. విజయమ్మ, కళావతి, సాయమ్మ, పేదలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలుపై అవగాహన

– ఎంపిడిఓ గీతాంజలి

సీతంపేట, డిసెంబర్ 3, మేజర్న్యూస్

ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎంపిడిఓ కె గీతాంజలి మంగళవారం సందర్శించి, మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు పరీక్షల్లో మంచి మార్కులతో పాటు సమాజంలో మంచి పౌరులుగా ఉండాలని సందేశం ఇచ్చారు.పోలీస్ శాఖ వారి సహకారంతో మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం పిల్లల్లో అవగాహన కల్పించడం జరిగింది. పెరుగుతున్న సైబర్ నేరాల దృష్ట్యా పిల్లలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమావాణి , హడ్డు బంగి సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి మరియు మహిళా పోలీస్ సంధ్య, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

వికలాంగుల సంఘం నాకు 15 లక్షలు బ్యాంకు లింకేజీ రుణాలు

బొబ్బిలి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతులు దినోత్సవం సందర్భంగా మంగళవారం బొబ్బిలి పురపాలక సంఘం యందు మెప్మా వారి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా, పిడి గారిచే సదరు సంఘాలకు (వికలాంగుల సంఘాలకు) 15,00,000 రూ బ్యాంక్ లింకేజ్ ఇప్పించడమైనది. ఈ కార్యక్రమమునకు మునిసిపల్ కమిషనర్ శ్రీమతి ఎల్. రామలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ ఆఫీస్ నుండి పట్టణ వికలాంగుల సంఘం సభ్యులు పాల్గొవడమైనది.

దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు

– ఈ విద్యా సంవత్సరంలో రూ.3.40 లక్షల ఉపకరణాలు, ఉపకార వేతనాలు అందజేత

పూసపాటిరేగ, డిసెంబర్ 3, మేజర్న్యూస్

దివ్యాంగుల పిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలతో కూడిన విద్యను అందజేస్తుందని మండల విద్యాశాఖ అధికారులు రాజ్కుమార్, పాపి నాయుడు లో తెలిపారు. మండల కేంద్రమైన పూసపాటిరేగ భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక క్రీడా పోటీలను నిర్వహించి వారికి మండల విద్యాధికారులు రాజ్ కుమార్, పాపి నాయుడు, మండల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బలివాడ శంకర్రావు తో కలిసి దివ్యాంగులకు మంగళవారం బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యా శాఖ అధికారులు మాట్లాడుతూ దివ్యాంగులు సంక్షేమం కోసం చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. భవిత కేంద్రం ద్వారా ఈ విద్యా సంవత్సరానికి గాను దివ్యాంగుల ఉపకరణాలు, ఉపకార వేతనాల కోసం రూ.3.40 లక్షలు ఖర్చు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బలివాడ శంకర్రావు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు తోటి పిల్లలు కంటే ఎంతో జ్ఞానవంతులని,వారిని ప్రోత్సహిస్తే ఉన్నత స్థానాలకు అధిరోహించే విధంగా ఆత్మస్థైర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం దివ్యాంగులకు వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలిమ, భవిత కేంద్రం నిర్వాహకులు వెంకటేశ్వరరావు,దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెంట గ్రామంలో పొలం పిలుస్తుంది

– రైతులకు అపరాల పంట పై అవగాహన– పాల్గొన్న వ్యవసాయ శాఖ ఏడీ శ్యాం సుందర్

బొబ్బిలిరూరల్, డిసెంబర్ 3, మేజర్న్యూస్

మండలంలోని పెంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది. రబి పంటలో వేసే అపరాల పంట మీద పూర్తి అవగాహన కల్పిస్తూ ముఖ్యంగా అపరాల దిగుబడి తగ్గట్టుకు ప్రధాన కారణాలైన కలుపు మందు వాడకపోవడం అదేవిధంగా పంటకి సకాలంలో నీటి తడులు మరువరు ఎరువులని అందించలేకపోవడం వలన ప్రధానంగా దిగుబడులు చాలా తక్కువగా ఉన్నవి. వీటిని అధిగమించడం కోసం రైతు విధిగా మూడు పద్ధతులను తూచా తప్పకుండా పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాం సుందర్ అవగాహన కల్పించడం జరిగింది. దీనిలో ప్రధానంగా మొక్క మూడు ఆకుల దశలో ఉండేటప్పుడు తప్పకుండా కలుపు నివారణ మందును వాడాలి. అదేవిధంగా ఐదు నుండి ఆరాకుల దశ ఉండేటప్పుడు ఎకరానికి ఐదు కేజీలు చొప్పున ట్యాంకు 500 గ్రాములు యూరియా కలిపి పిచికారి చేయాలి . ఎకరానికి 10 ట్యాంకులు అదేవిధంగా పూత దశలో 3 19 అనే నీటిలో కరిగే ఎరువుని ఎకరానికి కేజీ మరియు ఒక పురుగుమందు ఒక తెగులు మందుని పిచికారి చేసుకున్నచో దిగుబడులు కనీసం ఒకటి నుండి రెండు క్వింటాళ్లు పెరగడానికి ఆస్కారం కలగని అవగాహన కల్పిస్తూ రైతులతో ఈ కార్యక్రమం రైతు పొలంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు రేణుక మరియు రైతు సోదరులు పాల్గొనడం జరిగినది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: బొబ్బిలి డిఎస్పి శ్రీనివాసరావు

రామభద్రపురం, డిసెంబర్ 3, మేజర్న్యూస్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి డిఎస్పీ పి శ్రీనివాసరావు కోరారు స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు వినూత్న రీతిలో మోసాలు చేస్తుండడంతో దీనిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్న ఓటీపీలు చెప్పండని కొంతమంది అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చిన రిసీవ్ చేసుకోవద్దని తెలిపారు అలాగే గంజాయి ఇతర మత్తు పదార్థాలపై గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశామని ఇప్పటికే దీనికి సంబంధించి ఒక టీం ఏర్పాటు చేసి వారి ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు ముఖ్యంగా యువతి గంజాయి బారిన పడకుండా ఉండాలని సూచించారు గంజాయి స్మగ్లరు యువతి ద్వారా రవాణా చేయడానికి అనేక ప్రణాళికలు రచిస్తున్నారని యువత వీటికి దూరంగా ఉండాలని అన్నారు అలాగే మహిళలపై లైంగిక దాడులపై కూడా అనేక చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యంగా యువతులు వేధించిన వారిపై ఫోక్సు చట్టం నమోదు చేస్తున్నామని తెలిపారు సంకల్ప కార్యక్రమం ద్వారా బొబ్బిలి సబ్ డివిజన్లో రోడ్డు ప్రమాదాలు నివారణ మత్తు పదార్థాల అక్రమ రవాణా వినియోగం మహిళపై లైంగిక దాడులపై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగిన చోట హెచ్చరిక బోర్డులో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు దొంగతనాల నివారణకు రాత్రి వేళలో పోలీసు గస్తీ చేపడుతున్నారని తెలిపారు అనంతరం పోలీస్ స్టేషన్ లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె నారాయణ రావు స్థానిక ఎస్సై వెలమల ప్రసాదరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత సమాజాన్ని స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బొబ్బిలి డిఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, డిసెంబర్ 3, మేజర్న్యూస్

సంకల్పం (ఫైట్ ఎగైన్స్ట్ డ్రగ్స్ యూసేజ్) అనే మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం విజయనగరం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమం లో భాగంగా, నేడు బొబ్బిలి మండలంలో స్వామి వివేకానంద పాలిటెక్నికల్ కాలేజ్ కలవరాయిలో, బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, పి. శ్రీనివాస రావు, ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగినది. అనంతరం డిఎస్పీ విద్యార్థులకు డ్రగ్స్ వాడితే వాటి వల్ల వచ్చే అనర్థాలు ప్రమాదాల గురించి వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. దీంట్లో భాగంగా ఫిర్యాదులను తెలియజేసే సంకల్పం డ్రాప్ బాక్స్ ను కూడా కళాశాలలో ఉంచడం జరిగింది. అనంతరం విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడే వారి సమాచారం ఇచ్చి పోలీసు వారికి సహకరించాలని బొబ్బిలి పోలీస్ స్టేషన్ యస్ హెచ్ ఓ గారైన కే. సతీష్ కుమార్ విద్యార్థులను కోరారు. అలాగే కాలేజీలో యాంటి డ్రగ్స్ కమిటీని కూడా నియమించడం జరిగిందని తెలిపారు. కాలేజ్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

తెర్లాం, డిసెంబర్ 3, మేజర్న్యూస్

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలు మంగళ వారం స్థానిక నాన్ భవిత విద్యా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి ఎన్.ఉ మాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారికి సహిత విద్య అందిస్తూ అనేక రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పన అందిస్తున్న ప్రభుత్వ సేవలు వినియోగించు కోవాలన్నారు. అలాగే సర్పంచ్ బోనెల రూప వికలాంగుల నుద్దేశించి అనేక సూచనలు అందించారు. అలాగే మండల విద్యాశాఖాధికారి జె. త్రినాథ రావు మాట్లాడుతూ గృహ విద్య ద్వారా వికలాంగుల పరిపక్వం చెంది భవిష్యత్తు లో ప్రయోజకులు కావడం పట్ల ఆయన వారిని అభినందించారు. అలాగే వికలాంగులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గెలుపు పొందిన వారికి బహుమతులు అందించారు. కార్య క్రమంలో వారితో పాటు ఎం. ఈ. ఓ.టు అర్. పాపా రావు జెడ్.పి ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆర్.అర్.రమేష్ ఐ. ఈ. ఆర్.టి. సూర్యారావు పలు పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు వికలాంగులు వాటి తలితండ్రులు పాల్గొన్నారు.

పేద ప్రజల గృహాలు నిలిపివేయడానికి ప్రభుత్వ నిర్ణయం సరికాదు..

పాతపట్నం, డిసెంబర్ 3, మేజర్న్యూస్

జగనన్న ఇచ్చిన ఇళ్ల స్థలాల రద్దుకు ప్రభుత్వం కుట్ర పై పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండి పడ్డారు..చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పాటు చేసి నెలలు గడవకముందే పేద ప్రజలపై కక్ష సాధింపు చర్యలు మొదలుపెట్టారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మంగళవారం పాతపట్నంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఒక ప్రకటన ద్వారా మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షల మంది నిరుపేద ప్రజలకు సొంత గృహాలను ఏర్పాటు చేసుకోవడానికి స్థలాలను సైతం జగన్మోహన్ రెడ్డి ఉచితంగా ఇచ్చారని, కొన్ని కారణాలతో నేటికీ గృహాలు ప్రారంభం కాకుండా పేదల గృహాలు రద్దు చేయాలని చంద్రబాబు క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆమె మండిపడ్డారు. నిరుపేదలపై కక్ష సాధింపు చర్యలు చంద్రబాబుకి కొత్త ఏమీ కాదని ఇటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని అన్నారు.గతంలో ఎన్నడు లేని విధంగా ఏ ప్రభుత్వం చేయలేని విధంగా చరిత్రలో నిలిచే విధంగా పేదల కలలుగన్న ఇళ్లను మంజూరు చేసిన జగన్మోహన్ రెడ్డి చరిత్ర పుట